## క్లుప్తంగా

### వైభవోపేతంగా ధనుర్మాస ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి


ఉసిరికాయల అలంకరణలో సుబ్రహ్మణ్య స్వామి

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని శ్రీ వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు జరిగాయి. విశేష ఆరాధన, తిరుప్పావై సేవాకాలం, తీర్థప్రసాద గోష్ఠి, పాశుర విశేషార్థ వివరణ కార్యక్రమాలు చేపట్టారు. స్వామివారు, అమ్మవార్లను వజ్రకవచంతో, సుబ్రహ్మణ్య స్వామిని ఉసిరికాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆంజనేయ స్వామికి విశేష అలంకరణ చేశారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు.

### ఏయూ టేబుల్ టెన్నిస్ జట్టు ఎంపిక


క్రీడాకారిణులను అభినందిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ మహిళల టేబుల్ టెన్నిస్ జట్టు ఎంపిక శనివారం జరిగింది. జట్టు సభ్యులను ముఖ్య అతిథి ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు అభినందించారు. అనంతరం మాట్లాడుతూ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఏయూ ప్రోత్సాహం కల్పిస్తుందని తెలిపారు. ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయమోహన్ మాట్లాడుతూ ఎంఎంఈటీ యూనివర్సిటీలో జనవరి 3 నుంచి 5 వరకు టేబుల్ టెన్నిస్ మహిళలు క్రీడలు జరుగుతాయన్నారు. ఏయూ మహిళా జట్టు ప్రతిభ చూపి వర్సిటీకి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కోచ్ కె.మురళి తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఫొటోగ్రఫీ శిక్షణ తరగతులు

ఏయూక్యాంపస్: విశాఖ కెమెరా క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6.30 నుంచి 8.30 గంటల వరకు బీచ్ రోడ్డులోని హవా మహల్‌లో ఫొటోగ్రఫీపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఫొటోగ్రాఫర్, కార్యక్రమ కమిటీ చైర్మన్ బి.కె.అగర్వాల్ ఒక ప్రకటనలో తెలిపారు. డిజిటల్, సెల్‌ఫోన్ కెమెరాల వినియోగం, మెళకువలు, అత్యుత్తమ ఫోటోలను తీసే విధానాలపై శిక్షణ అందిస్తామన్నారు. తక్కువ వెలుతురు ఉన్న సందర్భాల్లో సైతం మెరుగైన ఫొటోలను సాధించే విధానాలను వివరిస్తామని చెప్పారు. మోడల్స్‌తో ప్రత్యక్షంగా ఫొటోగ్రఫీలో శిక్షణ సైతం అందిస్తామన్నారు. ఫొటోగ్రఫీపై ఆసక్తి గల వారు, మెళకువలు నేర్చుకోవాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు 94407 33358 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### ఐఎల్‌ఏ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

విశాఖ విద్య: ఇండియన్ లాయర్స్ అసోసియేషన్(ఐఎల్ఏ) నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన ఉత్తరాంధ్ర కేడర్ కేంప్ సమావేశంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. వర్సిటీ పాలిటిక్స్ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి పేటేటి ప్రేమానందం చేతుల మీదగా క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశారు. న్యాయవాదుల సమస్యలపై చర్చించారు.



- ఇటీవల కొత్త భవనంలోకి ఆరిలోవ పోలీస్ స్టేషన్ తరలింపు
- మూడు వారాలుగా పాత పీఎస్ వద్దే సీజ్‌చేసిన వాహనాలు
- వీటిని వదిలేయడంతో స్థానికులకు ఇబ్బందులు
- ఇక్కడున్న మూడు సచివాలయాలకు వెళ్లే దారి లేక అవస్థలు



# సీజ్డ్ వాహనాల సంగతేంటో..?


ఆరిలోవ పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏళ్లుగా పడి ఉన్న వాహనాలు



ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ ఇరుకు గది నుంచి బయటపడి విముక్తి పొందింది. దీంతో ఇక్కడ పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి ఊరట లభించింది. పాత పీఎస్‌ను కొత్త భవనంలోకి తరలించి.. సీజ్ వాహనాలను వదిలేయడంతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు మాత్రం ఇంకా పరిష్కారం దొరకలేదు. విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) ఆవరణలో నిర్మించిన కొత్త పోలీస్ స్టేషన్ భవనం ఇటీవల ప్రారంభమైన విషయం తెలిసిందే. దీంతో ఆరిలోవలోని పాత పీఎస్‌ను ఖాళీ చేసి మూడు వారాల కిందట అక్కడికి తరలించారు. అంతవరకు బాగానే ఉన్నా.. పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో వందల కొద్దీ సీజ్‌చేసిన వాహనాలు మాత్రం గుట్టలుగా ఉండిపోయాయి. వాటిని మాత్రం పోలీసులు కొత్త భవనం వద్దకు తరలించకుండా వదిలేశారు. ఇవి స్థానికులకు ఇబ్బందికరంగా మారాయి. ఇక్కడ సుమారు పదేళ్ల నుంచి వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను నిలిపి ఉంచారు. కాలక్రమేణా వాటి భాగాలు పాడయ్యాయి. చివరికి ఎందుకు పనికి రానివిగా మిగిలాయి.

**సచివాలయాల దారిలో అడ్డంగా..**

ఆరిలోవ పోలీస్ స్టేషన్ వెనుక 12వ వార్డుకు చెందిన 1, 2, 21 నంబర్ గల మూడు సచివాలయాలు నిర్వహిస్తున్నారు. వాటికి రోజూ వందల మంది స్థానికులు వివిధ పనుల నిమిత్తం వెళ్తుంటారు. ఈ సచివాలయాలకు పాత పోలీస్ స్టేషన్ పక్క నుంచి వెళ్లాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదాలు, దొంగతనానికి గురైనవి తదితర వాహనాలను పోలీసులు పట్టుకొని కొన్నేళ్ల నుంచి ఇక్కడ నిలిపి వదిలేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణంతా ఈ వాహనాలతో నిండిపోయింది. దీంతో ఆయా సచివాలయాలకు వెళ్లే దారి కూడా లేకుండా పోయింది. వాహనాలు నిలిపిన ఇరుకు దారి నుంచే స్థానికులు ఇబ్బంది పడుతూ సచివాలయాలకు వెళ్తున్నారు. సచివాలయాల సిబ్బంది కూడా వారి వాహనాలను అక్కడ నిలుపుకోవడానికి సైతం వీలు పడటం లేదు. తుప్పు పట్టిన వాహనాలతో పీఎస్, సచివాలయాల ఆవరణంతా అస్తవ్యస్తంగా మారింది. కొత్త భవనంలోకి ఆరిలోవ పోలీస్ స్టేషన్‌ను తరలించినా.. ఇక్కడ తుక్కుగా మారిన వాహనాలను మాత్రం అలాగే వదిలేయడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ వాహనాలను వెంటనే ఇక్కడ నుంచి తరలించి స్థలాన్ని శుభ్రం చేయించాలని కోరుతున్నారు.


సచివాలయాల ముందు నిలిపి వదిలేసిన సీజ్ కార్లు, ఆటోలు, బైక్‌లు


పీఎస్ ఆవరణలో తుప్పు పట్టి భూమిలోకి కూరుకుపోయిన కార్లు, ఆటోలు

### సచివాలయాలకు వెళ్లే దారి లేదు

ఆరిలోవ పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న సచివాలయాలకు వెళ్లే దారి లేక ఇబ్బందిగా ఉంది. మాది 21వ నంబర్ సచివాలయం. ఏ పనిమీద అక్కడికి వెళ్లాలన్నా.. ఎప్పుడూ వాహనాలు అడ్డుగా ఉంటున్నాయి. పోలీస్ స్టేషన్‌ను కొత్త భవనంలోకి తరలించడం వల్ల వాహనాలు సమస్య పోతుందని అనుకున్నాం. వాహనాలను మాత్రం ఇంకా తరలించలేదు.

– ఆర్.వెంకటరావు, నెహ్రూనగర్

### వాహనాలను వెంటనే తరలించాలి

పోలీస్ స్టేషన్ వెనుక వదిలేసిన సీజ్ చేసిన వాహనాలను పోలీసులు వెంటనే కొత్త పీఎస్ భవనం వద్దకు తరలించాలి. ఇక్కడ నిలిపిన వావానాల వల్ల వివిధ పనుల మీద సచివాలయాలకు వెళ్లే దారి లేకుండా పోయింది. పోలీస్ అధికారులు దీనిపై దృష్టి పెట్టి వాహనాలను తక్షణం తరలించేలా చర్యలు చేపట్టాలి.

– ఎస్.ప్రభాకరరావు, లీలాసుందరినగర్

## ఏయూలో అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రయోగశాలలు


మాట్లాడుతున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య:

ఆంధ్రా యూనివర్సిటీలో ప్రయోగశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దేలా మరింత శ్రద్ధ తీసుకుంటున్నామని వీసీ ఆచార్య జి.శశిభూషణరావు తెలిపారు. దేశ గుణాత్మక మండలిలో భాగమైన నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లేబరేటరీస్(ఎన్ఏబీఎల్) ఆధ్వర్యంలో ఏయూ ఇంజినీరింగ్ విభాగంతో సంయుక్తంగా ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్, దాని ప్రయోజనాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఏయూలోని ప్రయోగశాలలను ఎన్ఏబీఎల్ ప్రమాణాలకు అనుగుణంగా ప్రామాణీకరించే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలో ఏయూలో ప్రారంభించనున్న ఫుడ్ టెస్టింగ్ ఫార్మా టెస్టింగ్ లేబరేటరీలో ఎన్ఏబీఎల్ గుర్తింపును తీసుకుంటామన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఇన్‌చార్జి హెడ్ ప్రొఫెసర్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రయోగశాలలకు ఎన్ఏబీఎల్ గుర్తింపు ఎంతో అవసరమన్నారు. ప్రామాణీకరించిన ప్రయోగ ఉపకరణాలను కలిగి ఉండడం, నాణ్యత ప్రమాణాలను కాపాడుకోవడం తద్వారా కచ్చితమైన ఫలితాలను అందించడం వీలవుతుందని చెప్పారు. ఎన్ఏబీఎల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ అక్రిడిటేషన్‌పై అవగాహన కల్పించే విధానాలను వివరించారు. దేశవ్యాప్తంగా 8,500 పైగా లేబరేటరీలకు ఎన్ఏబీఎల్ గుర్తింపును అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ పి.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆనందమానందమాయె..


విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులతో 1998 బ్యాచ్ విద్యార్థులు

ఏయూక్యాంపస్: దశాబ్దాల కిందట కలసి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. బీచ్ రోడ్డులోని ఒక హోటల్‌లో శనివారం అన్నపూర్ణ ట్యుటోరియల్ కళాశాల 1998 బ్యాచ్ విద్యార్థులంతా కలిశారు. దాదాపు 26 ఏళ్ల తరువాత తమకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను సత్కరించారు. డాబాగార్డెన్స్‌లో 1961లో ప్రారంభమైన ఈ పాఠశాలలో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు తమకు పాఠాలు చెప్పిన అధ్యాపకులు ప్రసాద్, వరలక్ష్మి, సుబ్బారావు, ఎస్.లక్ష్మి, బాల సరస్వతిని సత్కరించి, వారి ఆశీస్సులు పొందారు. ఈ బ్యాచ్‌లో చదువుకుని ఐసీఎంఆర్ శాస్త్రవేత్తగా పనిచేస్తున్న డాక్టర్ సుధాకర్ అపూర్వ కలయికకు అధ్యక్షత వహించారు. ఇదే బ్యాచ్‌లో చదువుకున్న ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సైతం పాల్గొని తన స్నేహితులతో సరదాగా గడిపారు. విదేశాల్లో స్థిరపడిన పలువురు పూర్వ విద్యార్థులు సైతం పాల్గొని సందడి చేశారు.

## కళాశాల గ్రంథాలయానికి పుస్తకాల వితరణ


కృష్ణా కళాశాల గ్రంథాలయానికి పుస్తకాలు అందిస్తున్న బోటనీ లెక్చరర్ పద్మావతి

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి బోటనీ లెక్చరర్ డాక్టర్ ఎస్.పద్మావతి విలువైన 30 పుస్తకాలను వితరణ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబుకు ఆ పుస్తకాలను శనివారం ఆమె అందించారు. పర్సనాలిటీ డెవలప్‌మెంట్, జీవితగాథలు, చారిత్రక గ్రంథాలు, తెలుగు సాహిత్య పుస్తకాలను ఇచ్చిన పద్మావతిని ప్రిన్సిపాల్ అభినందించారు. వీటిని విద్యార్థులకు అందుబాటులో ఉంచేందుకు కళాశాల గ్రంథాలయ అధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, డాక్టర్ కె.రవిబాబు, డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు, డాక్టర్ జి.వి.ప్రతాప్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

## పిల్లల సర్జరీలపై అవగాహన అవసరం


రెయింబో చిల్డ్రన్ ఆస్పత్రిలో పిల్లల తల్లిదండ్రులతో వైద్యులు

ఆరిలోవ: పిల్లలకు చేసే సర్జరీలపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని రెయింబో చిల్డ్రన్ ఆస్పత్రి పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ రావి హిమజ సూచించారు. ఆస్పత్రిలో శనివారం జాతీయ పీడియాట్రిక్ సర్జన్ దినోత్సవం నిర్వహించారు. కొద్దికాలంగా ఈ ఆస్పత్రిలో సర్జరీలు జరిగిన పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సర్జరీలు జరిగిన పిల్లలను సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ హిమజ మాట్లాడుతూ ఇటీవల పుట్టినప్పటి నుంచి కొందరు పిల్లలకు యూరినరీ సమస్యలు వస్తున్నట్లు తెలిపారు. అలాంటి పిల్లలకు నెలలు, తక్కువ ఏళ్ల వయసులోనే సర్జరీలు చేయాల్సిన అవసరం వస్తుందని చెప్పారు. అలాంటి సర్జరీలపై తల్లిదండ్రులకు అనుమానాలు రావడం సహజమన్నారు. పిల్లలకు నొప్పి లేకుండా ల్యాప్రోస్కోపిక్ సర్జరీలు చేసి వారి సమస్యను మొదట్లోనే తొలగించవచ్చన్నారు. ఈ ఏడాదిలో 15 మంది పిల్లలకు పుట్టుకతో వచ్చిన లోపాలను సరిచేసి సర్జరీలు జరిపామన్నారు. వారిలో ఇటీవల నెలలు నిండని 27 వారాలకే జన్మించిన శిశువుకు పేగులో రంధ్రాలను క్లిష్టమైన శస్త్రచికిత్స ద్వారా విజయవంతంగా సరిచేశామని తెలిపారు. ఆధునిక పరికరాలు, పరిజ్ఞానం ఉన్నందున తల్లిదండ్రులు పిల్లలకు సర్జరీలు చేయడానికి భయపడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు డాక్టర్ అశ్విన్, డాక్టర్ శ్రీలత, డాక్టర్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## సాగర తీరంలో.. సరదాగా కాసేపు


సాగర తీరంలో టెంట్ వేసుకుంటున్న పర్యాటకులు

ఏయూక్యాంపస్: విదేశాల్లో సాగర తీరాన ఎక్కువసేపు గడపడం అక్కడి ప్రజలకు అలవాటు. వీరు ప్రత్యేకంగా టెంట్, కుర్చీలు తెచ్చుకుని గంటల సమయం తీరంలో సరదాగా గడుపుతారు. ప్రస్తుతం ఇటువంటి ట్రెండ్ భారత్‌లో కూడా ప్రారంభమైంది. ఇప్పటి వరకు పర్వతాలపై ట్రెకింగ్‌కు వెళ్లిన సందర్భంలో, అరకు పరిసర ప్రాంతాల్లో సందర్శనకు వెళ్లిన పర్యాటకులు తమ వెంట ప్రత్యేకమైన టెంట్‌లు, కుర్చీలు తీసుకెళ్తున్నారు. శనివారం విశాఖ సాగర తీరంలో వైఎంసీఏ ఎదురుగా పర్యాటకులు తమ వెంట క్యాంపింగ్ టెంట్, కుర్చీలు తెచ్చుకుని ఇసుక తిన్నెలపై ఏర్పాటు చేస్తుండగా.. 'సాక్షి' క్లిక్ మనిపించింది. వీరు ఎండలో సైతం హాయిగా టెంట్‌లో సేదతీరుతూ సాగరాన్ని, కెరటాలను చూస్తూ ఎంజాయ్ చేశారు. పర్యాటక విశాఖకు ఇటువంటి క్యాంపింగ్ టెంట్‌లు ప్రత్యేకతను తీసుకొస్తాయి. భవిష్యత్తులో ఈ తరహా పర్యాటకులు పెరిగే అవకాశాలున్నాయి. వీరి కోసం కనీస సదుపాయాలు కల్పిస్తే తీరంలో పర్యాటకం కొత్తపుంతలు తొక్కుతుంది.

## ట్రాఫిక్ నియమావళిపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఏయూక్యాంపస్: జీవీఎంసీ 21వ వార్డులోని ఏయూ తెలుగు మాధ్యమం పాఠశాలలో శనివారం ట్రాఫిక్ నియమావళిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బుచ్చిరాజు విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలను తెలియజేశారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండటానికి, నివారించడానికి అనుసరించాల్సిన నియమాలను వివరించారు. మైనర్‌లు వాహనాలు నడపరాదని, నిర్ణీత వయసు వచ్చిన తరువాత లైసెన్స్ తీసుకుని వాహనాలు నడపాలని సూచించారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో షిపా ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ శశిప్రభ, ఎంఈవో పుష్యరాగం, ప్రసాద్, నరసింగ్, భాస్కర్, ప్రధానోపాధ్యాయిని కె.సలోమి తదితరులు పాల్గొన్నారు.

## సదస్సుకు పిలవకపోతే సమస్యలెలా తెలుస్తాయి..?

**రెవెన్యూ సదస్సులో అధికారులపై జైసంతోషిమాత కాలనీ అధ్యక్షుడి ఆగ్రహం**



జైసంతోషిమాత కాలనీ రెవెన్యూ సదస్సులో అధికారులను నిలదీస్తున్న నర్సింహారావు

బీచ్‌రోడ్డు: గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులకు గ్రామాధ్యక్షుడు, పెద్దలను పిలవకపోతే అధికారులకు సమస్యలెలా తెలుస్తాయని జైసంతోషిమాత కాలనీ గ్రామ ప్రెసిడెంట్ సిహెచ్.నర్సింహారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవీఎంసీ 28వ వార్డు జైసంతోషిమాత కాలనీలో డిప్యూటీ తహసీల్దార్ జిలాని ఆధ్వర్యంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు సదస్సు కోసం ఎటువంటి సమాచారం ఇవ్వలేదని.. గ్రామ పెద్దలకు పిలవకపోతే సమస్యలెలా తెలిస్తాయని అధికారులను ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దళారుల వ్యవస్థ పెరిగిపోయిందని, ఏ ధ్రువపత్రం కావాలన్నా.. వేల రూపాయలు ముట్టజెప్పాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ముఖ్యంగా లీగల్ హైర్, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం కూటమి నాయకులకు ముడుపులు చెల్లించుకుంటేనే వస్తున్నాయని తెలిపారు. కొంతమంది దళారులుగా ఏర్పడి రాణి కమలాదేవికి చెందిన భూములను అధిక ధరలకు అమ్మేస్తున్నారని ఆరోపించారు. పేదలకు చెందాల్సిన భూములను ఇలా అన్యాయంగా వేరే వారికి ధారాదత్తం చేస్తున్నారన్నారని వివరించారు. ప్రభుత్వం తక్షణమే ఆ భూములను స్థానికులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రెసిడెంట్ నర్సింహారావు కోరారు.

**రెవెన్యూ సదస్సుకు 21 దరఖాస్తులు**

మహారాణిపేట: సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని మహారాణిపేట ఇన్‌చార్జి తహసీల్దార్ జిలానీ అన్నారు. 28వ వార్డు దసపల్లా హిల్స్‌లో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించి, మాట్లాడారు. ఎటువంటి సర్టిఫికెట్లు కావాలన్నా.. దరఖాస్తు చేస్తే తక్షణం ఇవ్వగలమని చెప్పారు. 19 కుల, 2 ఆదాయ ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు వచ్చాయి. స్థానికులు మొత్తం 21 దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ఎండోమెంట్ ఈవో ప్రసన్నలక్ష్మి, టీడీపీ నాయకుడు కనకరాజు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## నిఖిలలోక హృదయవాసుడు.. శ్రీనివాసుడు


ప్రవచిస్తున్న విభీషణ శర్మ


భక్తిగీతాలు ఆలపిస్తున్న మాధురి, శిరీష

ఎంవీపీకాలనీ: కష్టాలను తొలగించి, అమృత ఐశ్వర్యాలను ప్రసాదించే నిఖిలలోక హృదయవాసుడిగా కలియుగ శ్రీనివాసుడు కొలువై ఉన్నాడని ఆకెళ్ల విభీషణ శర్మ అన్నారు. శ్రీ సుదర్శన సీతారామాచార్యులు నేతృత్వంలో, ఉదయగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని భద్రం పార్కు వేదికగా నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర వైభవం ప్రవచన కార్యక్రమం శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా మూడో రోజు విభీషణ శర్మ చేసిన ఆధ్యాత్మిక ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. శ్రీవారిని కీర్తించడం, సేవించడం ప్రతి భక్తుడికి పూర్వజన్మ సుకృతమన్నారు. ఈ సందర్భంగా వైభవ సిస్టర్స్ పి.మాధురి, పి.శిరీష బృందం, రత్నమాల చిన్నారుల బృందం చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తిగీతాల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఈ నెల 29వ తేదీ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. నిర్వాహకులు కందాళ అరుణగాయత్రి, డి.శ్రీనివాస్, వి.వి.ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లోకి తీసుకోవాలని హెల్త్ అసిస్టెంట్ల విజ్ఞప్తి


ఎంపీ శ్రీభరత్‌కు హెల్త్ అసిస్టెంట్ల సమస్య వివరిస్తున్న శ్రీనివాసచార్యులు

మద్దిలపాలెం: వైద్య, ఆరోగ్య శాఖలో 22 ఏళ్ల పాటు సుదీర్ఘంగా సేవలందించిన తమను తొలగించారని, తిరిగి విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలని విశాఖ ఎంపీ శ్రీభరత్‌ను హెల్త్ అసిస్టెంట్లు కోరారు. శనివారం ఆయనను కార్యాలయంలో టీఎన్‌టీయూసీ తెలుగునాడు వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచార్యులు సమక్షంలో హెల్త్ అసిస్టెంట్లు కలిసి సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రితో చర్చించి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## నేడు కళాభారతిలో సాహిత్యంపై సదస్సు

మద్దిలపాలెం: భాషకు ప్రాణవాయువులాంటి సాహిత్యంపై ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాభారతి ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ గుమ్మలూరి రాంబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 6.15 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రస్తుత కాలమాన పరిస్థితుల్లో సాహిత్యానికి ప్రాధాన్యం కొరవడుతోందనే అంశంపై చర్చ జరుగుతుందని తెలిపారు. సాహిత్యాన్ని ప్రత్యేకంగా కూర్పు చేసిన 'భువన విజయం' సాహితీ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని ఆయన చెప్పారు.

## కోతకు గురైన ప్రాంతం పరిశీలన


బీచ్ రోడ్డులో కుంగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

ఏయూక్యాంపస్: ఇటీవల బీచ్ రోడ్డులో కోతకు గురై కుంగిన ప్రాంతాన్ని శనివారం జీవీఎంసీ జోన్–4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు పరిశీలించారు. 29వ వార్డులో పర్యటించిన ఆయన పారిశుధ్య సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. పారిశుధ్యానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. అనంతరం బీచ్ రోడ్డులో కుంగిన ప్రాంతాన్ని సందర్శించి, సిబ్బందికి సూచనలు చేశారు.

## డ్వాక్రా మేళాకు విశేష స్పందన


వినియోగదారులతో కిటకిటలాడుతున్న డ్వాక్రా మేళా ప్రాంగణం


కళాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న యూసీడీ పీవో రమణమ్మ

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ, మెప్మా ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మైదానంలో నిర్వహిస్తున్న డ్వాక్రా ఉత్పత్తుల మేళా ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ మేళాకు నాలుగో రోజు శనివారం నగరవాసుల నుంచి విశేష స్పందన లభించింది. నగర పరిధిలోని డ్వాక్రా సంఘాల సభ్యులు వారు తయారు చేసిన ఉత్పత్తులను ఇక్కడ విక్రయిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా జీవీఎంసీ యూసీడీ పీడీ సత్యవేణి మాట్లాడుతూ ఈ నెల 29 వరకు డ్వాక్రా మేళా కొనసాగుతుందని తెలిపారు. డ్వాక్రా సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మేళా నిర్వహించినట్లు చెప్పారు. 100 స్టాళ్ల ద్వారా విక్రయాలు జరుగుతుండగా నగరవాసులు ఉత్సాహంగా కొనుగోళ్లు చేస్తున్నారన్నారు. శనివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కూచిపూడి, భరతనాట్యం వంటి నృత్యాలతో కళాకారులు ఇచ్చిన ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాకారులకు యూసీడీ పీవో రమణమ్మ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.